# ఎదురు చూస్తున్న ముహూర్తం

౧

శాంత ఎప్పుడూ దేనికోసమో ఎదురు చూస్తూంటుంది. తక్కిన జనాభాకంటె తానొక పైతరహాకి చెందిన వ్యక్తినని ఆమె గట్టినమ్మకం. తను చాలా అందకత్తె అని ఆమె అభిప్రాయం. కాని ఆ విషయాన్ని నలుగురికీ తెలియజెప్పాలనే కుతూహలం లేకపోవడమే ఆమెలో గొప్పతనం. నిజానికి ఆమె పెద్ద అందకత్తె కాదు. నుదురు కొంచెం ఎత్తు. కళ్లలో ఆమెలోని ఆవేశం ప్రతిఫలిస్తుందికాని, ప్రశాంత

శ్రీ పద్మరాజు

మయిన, సహజమయిన తళుకు లేదు. ముక్కు, నోరు మట్టుకు అందమయినవి. పెదవులు ముఖ్యంగా ఇంకా విచ్చుకోని గులాబిమొగ్గలా చిన్నగా ముద్దుగా ఉంటాయి. కాని ఆమె వేపు నలుగురూ చూస్తారు. ఆమె అనుకోకుండానే ఆకర్షిస్తుంది.

కుటుంబంలోకి ఆఖరుపిల్ల కావడంచేత అల్లారు ముద్దుగా పెరిగింది. అల్లా పెరిగినందువల్ల సహజంగా అబ్బే లక్షణాలన్నీ శాంతకు ఉన్నాయి. ఆమె మాటకు ఎవరూ ఎదురుచెప్పకూడదు. ఆమెకు కోపం వచ్చినట్టయితే అందరూ భయపడాలి. ఆమెకు దుఃఖం వస్తే నలుగురూ ఓదార్చాలి. కాని ఈ లక్షణాలు ఎక్కడ బయటపెట్టకూడదో ఆమెకు స్వభావసిద్ధంగా తెలుసు. పైవాళ్లు అంత మర్యాదయిన పిల్ల లేదనుకుంటూగు. గారంవల్ల తలిదండ్రులకు ఈ లక్షణాలు కనపడవు. శాంతకయినా ఇల్లాంటి లక్షణాలు తనకున్నాయని స్పష్టంగా తెలియదు.

తన జీవితాన్నంతనీ తారుమారుచేసే సంఘటన ఎప్పుడో ఎల్లాగో ఏదో వస్తుందనీ, అది అతిలోకమయిన అనుభవం అవుతుందనీ ఆమెకు గట్టినమ్మకం. ఆ సంఘటన ఎల్లాంటిదో ఆమెకు ఏమీ తెలియదు. కాని ఆ సంఘటనకోసం ఆమె నిత్యమూ నిరీక్షిస్తూ ఉండేది.

ఆమె కాలేజీలో ప్రవేశించినతరవాత ప్రతీ వ్యక్తిలోనూ, ప్రతీసందర్భంలోనూ ఈ సంఘటన కోసం వెతుక్కోడం ప్రారంభించింది. తోడివిద్యార్థులలో చాలామందిని ఆమె రహస్యంగా పరీక్షిస్తుండేది. కాని వారు ఏమాత్రం చేరువగా రావడానికి ప్రయత్నించినా ఆమె దూరంగా పోతుండేది. ఆమె దూరంగా పోయినకొద్దీ ఆమెను వెంటాడిన విద్యార్థి ఎవడూ లేకపోయాడు. కాని ఆమె వేదికమీదికి ఎక్కి ఉపన్యాసాలివ్వడం అలవాటుచేసుకుంది. వక్తృత్వపు పోటీలలో కాలేజీకి కీర్తి గడించింది. ఆ

సందర్భాలలో పొరుగూరు వెళ్లినప్పుడు నలుగురయిదుగురు వ్యక్తులతో ఆమెకు దగ్గరిపరిచయం ఏర్పడింది. కాని వాళ్ల అభిరుచులు ఆమెకు వెగటుగొలిపేవి. అంచేత వాళ్లదగ్గర మరీ జాగ్రత్తగా మసలేది. అధ్యాపకులను కూడా ఆమె జాగ్రత్తగా పరిశీలించేది. ఆమెతో చనువుగా మాట్లాడే వ్యక్తులు ఆమెకు నచ్చినవారు కారు. ఎవరియందు ఆమెకు కుతూహలం కలుగుతుందో వారు దూరంగా అందకుండా ఉండిపోయేవారు.

ఒకసారి నిజంగా ఆమె ఆ ముహూర్తం వచ్చిందనుకుంది. ఆమె ఒకనాడు డీసెల్ కార్‌లో ప్రయాణం చేస్తుండగా, తన పక్కని నిలబడి ప్రయాణంచేస్తున్న ఒక వ్యక్తి అదేపనిగా తనవేపు చూడడం ఆమె చూసింది. కొంతసేపయినతర్వాత అతను "ఎక్కడికి వెడుతున్నా" రని ప్రశ్నించాడు. ఆమె సమాధానం చెప్పింది. దిగినతరవాత అతను కూడా వచ్చి వాళ్ల ఇంటిదగ్గర దిగబెట్టాడు. సంభాషణలో ఏమీ అసభ్యమయిన సూచనకూడా లేకుండా చాలా మర్యాదగా, హుందాగా ప్రవర్తించాడు. మనిషి చాలా లోతయినవాడిలాగ కనిపించాడు. ఆరాత్రి అతను పదేపదే ఆమెకు కలల్లో జ్ఞాపకంవచ్చాడు. మరునాడు ఉదయం ఆమెకు ఏదో జరగబోతోందనే ఆందోళన మనస్సులో అంకురించింది. కాని ఆనాటి మధ్యాహ్నమే ఆమెకు అతను వ్రాసిన ఒక చీటీ వచ్చింది. అది చచ్చురకపు ప్రణయలేఖ. ఆమె ఆశలన్నీ నిరాశలయిపోయాయి. నలుగురయిదుగురు తోడి విద్యార్థులు ఆమెకు ప్రణయలేఖలు వ్రాశారు. అవి ఆమెకు అసహ్యంగా అనిపించాయి. వాటిని ఆమె బయటపెట్టా లేదు, వాటికి సమాధానాలు వ్రాయనూ లేదు.

కాలేజీ వదలిపెట్టేదాకా ఆమె ఆముహూర్తం కోసం ఎదురుచూస్తూనే ఉంది. కాని ఆ ముహూర్తం మాత్రం రాలేదు.

## ౨

శాంత పెళ్లి మామూలుపద్ధతిలోనే జరిగిపోయింది. మామూలుగా సంపన్నగృహస్థుఇంట్లో పెళ్లి ఎల్లా జరుగుతుందో అల్లాగే జరిగిపోయింది. వరుడు వాడు వైద్యపరీక్షకు చదువుతున్నాడు. నలుగురు అన్నదమ్ములలో రెండోవాడు. తెలివయినవాడని నలుగురూ అన్నారు. కట్నం పదివేలరూపాయలు. పెళ్లి అయిదురోజులు. వరుని పేరు లక్ష్మీకాంతరావు.

పెళ్లికొడుకుని పెళ్లి అయిపోయేదాకా శాంత పరీక్షగా చూస్తూనే ఉంది. ఆడవాళ్లంతా అది చూసి ముసిముసినవ్వులు నవ్వుకున్నారు. పెళ్లికొడుకు చిరునవ్వు నవ్వినప్పుడు ఆమె తిరిగి నవ్వలేదు. అల్లాగే చూస్తూ కూర్చుంది. పెళ్లిపీటలమీద కూర్చున్నప్పుడు పెళ్లికొడుకుతమ్ముడొకడు తరుచు వచ్చి పెళ్లికొడుకుని పలకరిస్తూండేవాడు. ఆ గొంతుక చాలా చిత్రంగా ధ్వనించేది. దూరాన్నుంచి మాట్లాడుతున్నా ఇట్టే ఆనవాలు కట్టవచ్చు. అతన్ని వెంకటం అని పిలుస్తారు అందరూ. బహుశా వెంకటేశ్వర్రావయి ఉంటుంది పేరు. అతను చటుకుని పగలబడి నవ్వేస్తుంటాడు. చిత్రవిచిత్రంగా మాట్లాడుతుంటాడు. తన్ను ఆకర్షించడానికి అదంతా చేస్తున్నాడని శాంతఅనుమానం. కాని మగపెళ్లివారితాలూకు ఆడవాళ్లతోటే, మగవాళ్లతోటే అతను ఎప్పుడూ వేళాకోళాలు ఆడుతుంటాడు. వాళ్లందరూ అతనిచుట్టూ చేరుతుంటారు కూడాను. శాంతకు అదంతా వెగటుగా ఉండేది. అతన్ని చూస్తే ఒక రకమయిన అసహనభావంకూడా కలిగింది.

కాని వివాహంలో ఆ ముహూర్తంకోసం ఆమె ఎదురుచూడలేదు. తన భర్త వట్టి మగవాడని ఆమె ముందే నిశ్చయించుకుంది. అయినా పెళ్లయి కాపురానికి వెళ్లినతరువాతకూడా ఆమె ఆ ముహూర్తంకోసం ఎదురుచూడ్డం మానలేదు.

భర్త ఆఖరుసంవత్సరం చదువుతుండగా ఆమె కాపురానికి వెళ్లింది. లక్ష్మీకాంతరావు ఎప్పుడో శల

వలకి వచ్చిపోతుండేవాడు. ఇంట్లో అత్తగారూ, మామగారూ, బావగారూ, తోడికోడలూ, వంటమనిషినీ. తోడికోడలుకూడా తనలాగే చిన్నది. కాని ఆమెకు నగలమీద, పిల్లలమీద మోజు ఎక్కువ. ఆమె అట్టే చదువుకోలేదు. బావగారి పేరు సుబ్బారావు. ప్లీడరీపరీక్షు పాసయి తండ్రికి ఆ వృత్తిలో సహాయపడుతున్నాడు. అత్తగారికి ఏమీ అక్కరలేదు. భోజనం అయినతరువాత ఇరుగుపొరుగునిగురించిన కబుర్లుమాత్రం చెపుతుండేది. తోడికోడలు ఆవిషయంలో అత్తగారికి తీసిపోదు. అంచేత వాళ్లిద్దరికీ ఎక్కువ స్నేహం. మామగారు విశాలమయిన మనిషి. మాటల్లోనూ, చేతల్లోనూ కూడా. శాంతకు మామగారంటే ఎక్కువ గౌరవం. బావగారు చాలా బద్ధకం మనిషి. మరుదు లిద్దరూ భర్తతోపాటు శెలవల్లో వచ్చిపోతుంటారు.

దీపావళికి లక్ష్మీకాంతరావు రాలేదు. వెంకటం ఒక్కడే వచ్చాడు. తన భర్త లేకుండా పుట్టింటికి వెళ్లడం శాంతకు ఇష్టం లేకపోయింది. వెంకటం పెద్దవదినగారితో అస్తమానూ వేళాకోళా లాడుతుంటాడు. ఆమెకూడా నవ్వుతూ తిప్పుకుంటూ అతనితో కలుస్తుంది. తండ్రిదగ్గర వెంకటానికి ఉన్నంత చనువు ఇంకెవ్వరికీ లేదు.

వెంకటం సాయంకాలం ఏడుగంటలవేళ చేతులు పట్టనంత బాణాసంచా బుట్టలతో పట్టుకుని వచ్చాడు. శాంత, తోడికోడలు దీపాలు వెలిగిస్తున్నారు. అత్తగారు అరుగుమీద కుర్చీలో కూర్చుని కబుర్లు చెపుతోంది. రెండో అరుగుమీద మామగారు చుట్ట కాల్చుకుంటూ పచారుచేస్తున్నారు. బావగారు ఇంటిఎదట వాకిట్లో నిలబడి దీపాలు చూస్తున్నారు. వెంకటం బాణాసంచా లోపల పెట్టి అరుగుమీదికి వచ్చి తల్లి కుర్చీపక్కని నిలబడ్డాడు. ఇంతలో కుర్చీ వెనక 'ఢాం' అని ఏదో పేలింది. ఆవిడ కుర్చీలో ఒక్కసారి ఎగిరి కిందపడింది. కొడుకుని ఉద్దేశించి తీవ్రంగా అంది: "ఏమిట్రా వెధవా! మంచీ చెడ్డా ఉండొద్దూ?" అందరూ గట్టిగా నవ్వారు. వెంకటం అన్నాడు—"చూశావమ్మా! ఎల్లా పేలుతాయోను."

"నీమొగం! నావీపువెనకా లేమిటి చూడ్డం?" ఆమెకూడా చివరకి నవ్వింది. నవ్వుతూ అంది: "ఏమి టీ కుర్రతనపు చేష్టలు?"

వెంకటం తండ్రిని ఉద్దేశించి అన్నాడు: "ఈవేళ నీచేత జువ్వలు కాల్పిస్తానయ్యా. ఒరే అన్నయ్యా, పెద్దవొదినచేత బందరుతూటాలు కాల్పించాలిరా."

"బాబోయి! చస్తాను" అంది ఆమె.

"మీ చిన్నవొదినచేత ఏం కాలిపిస్తావురా మరీ?" అంది తల్లి.

వెంకటం కొంచెంసేపు ఏమీ అనలేదు. చివరకి అన్నాడు: "ఆవిడఇష్టం. అపయిని నాకు చదువుకున్న ఆడవాళ్లంటే అమితభయం."

అందరూ నవ్వారు. శాంత తన కోపాన్ని మనస్సులోనే అణచుకుంది.

భోజనాలు అయినతరవాత అన్నదమ్ము లిద్దరూ బాణాసంచా పట్టుకొని ఊళ్లోకి పోయారు. అత్తగారూ, మామగారూ నిద్రపోయారు. తోడికోడలు శాంతగదిలోకి వచ్చి కూర్చుంది.

"అతనుకూడా వస్తే ఎంత బాగుండును" అంది.

"రావడానికి వీల్లేకపోయిందట. అందులో ఆఖరుసంవత్సరంకూడాను" అంది శాంత.

"వెంకటం మంచి సరదాఅయినవాడు."

"చకిలితనం ఎక్కువ."

"కాదమ్మోయి! పైవాళ్లదగ్గర చాలా మర్యాదగా మసులుతాడు......మరేమోనేం, విన్నావో లేదో కాని, కాలేజీలో ఆడపిల్లలు కొందరు అతనికి ఉత్తరాలు రాస్తుంటారట."

"నేను నమ్మను. అతనే చెప్పుకున్నాడా?"

"లేదమ్మోయి! అత నిల్లాంటి వేవీ చెప్పడు. మా పింతల్లిగారి మేనకోడ లుంది- అంటే మా పిన్నాన్నగారి మేనకోడ లన్నమాట- ఆ అమ్మాయి చెప్పింది. కాలేజీలో చదువుతోంది. ఇంకో అమ్మాయుందిట. ఇతనంటే పడిచచ్చిపోతుందిట. కిరస్తానీలుట. ఇతనికి రెండేసి రోజులకు ఒక్కొక్క ఉత్తరం రాస్తుంటుందిట...... ...ఏమమ్మోయి! నిజ మేమిటో దేవుడికి తెలియాలిగాని ఆ అమ్మాయికీ ఇతనికీ సంబంధం ఉందని చెప్పింది ఆపిల్ల......కాని చాలా సరదా అయినవాడు......చక్కని కథలు రాస్తాడుట. నే నెప్పుడూ చదవలే దనుకో. అన్ని పత్రికలకీ రాస్తుంటాడుట."

శాంతకు ఆరాత్రి చాలాసేపటివరకు నిద్ర పట్టలేదు. తోడికోడలు చెప్పిన విషయాలు ఆమె మనస్సులో చాలాసేపు తిరిగాయి. కాలేజీలలో ఇల్లాంటి విషయాలు ఎల్లా జరుగుతాయి? ఇంకా మగపిల్లలు ఆడపిల్లలికి ఉత్తరాలు రాయగలరుకాని, ఆడపిల్లలు ఎల్లా రాస్తారు?

వెంకటం అంటే ఆమెకు అసహ్యం మరీ ఎక్కువయింది.

## 3

భర్త మద్రాసులో కాపురంపెట్టిననాటినించీ శాంత ఇంటికి యజమానురా లయింది. లక్ష్మీకాంతం ఒకరకంగా సాధువు, ఒకరకంగా వెంకి. అతనికి సంబంధించిన విషయాల్లో అతనికి ఎంత తోస్తే అంతే. ఇంటివిషయాల్లోమట్టుకు అతను అన్నీ శాంతకు వదిలివేస్తాడు. శాంతకు కోపం వచ్చినప్పుడు అతను ఆ సంగతి తను గ్రహించనట్టు ప్రవర్తిస్తాడు. అంచేత శాంత తన కోపాన్ని అతనిమీద ఆయుధంగా ప్రయోగించలేకపోయింది. ఆడవాళ్లకు రెండో ఆయుధం కన్నీరు. కాని శాంత ఆ ఆయుధాన్ని ప్రయోగించలేదు. ఏడవడం ఎంచేతో ఆమెకు ఆత్మగౌరవానికి భంగంగా కనిపిస్తుంది. కాని ఆమెకు ఏడవా లనిపించిన ముహూర్తాలు లేకపోలేదు.

ఆమె కాపురం సుఖంగానే గడిచిపోతోంది. క్రమంగా ఆమెకు భర్తయెడల గౌరవం ఏర్పడింది. కాని ఆమెలో ఏదో తీరని వ్యథ ఉంది. ఆమెజీవితం ఇల్లా గడిచిపోతుందని ఆమె ఎన్నడూ అనుకోలేదు. కాని ఎల్లాగ జీవితం మారితే తనకు బాగుంటుందో ఆమెకు స్పష్టంగా తెలియదు.

ఒకనాడు లక్ష్మీకాంతం హాస్పిటల్‌నించి ఇంటికి వస్తూ చేతిలో ఒక కాగితాలకట్ట తీసుకు వచ్చాడు. శాంత ఏమి టని అడిగింది.

"నీకోసమే."

"ఏమి టవి?"

"మా వెంకటంకథలు."

"నా కక్కర్లేదు. అంతకంటే మంచి పుస్తకాలు చాలా చదివాను."

లక్ష్మీకాంతం పకపక నవ్వాడు.

"ఎందు కంత నవ్వు?"

"సరిగ్గా వాడు ఎల్లా రాశాడో అల్లాగే అన్నావు నువ్వు."

"నన్నుగురించి ఉత్తరాల్లోకూడా రాస్తున్నాడేమిటి?"

"లేదు. నేను రాసిన ఉత్తరానికి సమాధానం వ్రాశా, డంతే. చదువుతాను విను."

"నేను వినను."

కాని లక్ష్మీకాంతం ఇంకేమీ అనకుండా చదవడం ప్రారంభించాడు. ఆమె వినకూడ దనుకుంటూనే వింది.

"ఈకథలు నీకు నచ్చవని నాకు తెలుసును. అంచేతే ఇన్నాళ్లనించీ నేను నీకు పంపలేదు. నీకు మంచి చిక్కని ప్లాటు ఉన్న అపరాధపరిశోధక నవలలు కావాలి. నా కథలవంటివి అసలు ఎందుకు

శాస్త్రాల్లో కూడా నీకు అర్థంకాదు. అంచేత ఈకథలు మా వదినగారికోసమని నేను ఊహించాను. ఆవిడ నిన్ను అడిగిందా ? ఆమెస్వభావాన్నిబట్టి అడిగిఉండ దని నేను అనుకుంటాను. నీకు తెలియకుండా రహస్యంగా సంపాదించి చదువుతుంది వీలయితే. కాని నువ్వీకథలు తీసుకువెళ్లి 'మా తమ్ముడు రాసిన కథలివ్వి. చదువు' అని ఇస్తే ఆమె ఏమంటుందో తెలుసా? 'నేను చదవను. ఇంతకంటె మంచికథలు లక్ష చదివాను' అంటుంది. అయినా సరే ఇయ్యి. నిజంగా ఈ కథలు ఆమెకు నచ్చుతాయి.

"అన్నట్టు మరిచిపోయినాను. నేను పెళ్లి చేసుకోకూడ దని నిశ్చయించుకున్నాను. నాన్నకి కూడా రాశాను. మనపెద్దలు చెప్పినట్టు బ్రహ్మచర్యాన్ని నషపడానికి కాదుసుమా, ఆసంగతి నీకే తెలుసు. నాబోటివాడికి పెళ్లి అసలు సరిపడదు. ఈ విషయం మా వదినగారితో చెప్పి ఆమె ఏమంటుందో జవాబు రాయి."

శాంత విని లోపలికి వెళ్లిపోతోంది. లక్ష్మీకాంతం ఆమెను కేక వేశాడు.

"మరేమంటావు ?"

"దేనికి ?"

"నువ్వేమంటావో రాయమన్నాడుగా."

"అవసరం తీరుతుంటే పెళ్లెందుకు ?"

లక్ష్మీకాంతం విరగబడి నవ్వుతుండగా శాంత చర్రున లోపలికి వెళ్లిపోయింది.

కాని మరునాడు ఆమె భర్త వెళ్లిపోగానే ఆ కట్ట తీసింది. ఒక కథ ప్రారంభించి చదివింది. పేరు ప్రణయలేఖలు. కాలేజీవిద్యార్థిని ఒకతె ఒక యువకుడికి ప్రణయలేఖలు వ్రాయడం ప్రారంభిస్తుంది. ఆ కుర్రవాడు సమాధానాలు వ్రాస్తాడు. ఆమెలేఖలలో శ్రద్ధ, భావన, ఊహ ప్రధానంగా ఉంటాయి. ఆమె రాసే విషయాలన్నీ భూమిని విడిచి కొంత ఎత్తుని ఆకాశంలో మెదులుతుంటాయి. అతని ఉత్తరాలలో అన్నీ వాస్తవికమయిన విషయాలే ఉంటాయి. ఆమెలో దేన్ని తను ఎక్కువగా ప్రేమిస్తున్నాడో, కాలేజీలో ఏగోడపక్కని నిలబడినప్పుడు అతనిహృదయం చివుక్కుమందో, ఫలానిరోజుని ఆమెమబ్బురంగుచీర, ఆకుపచ్చజాకెట్టు తొడుక్కువచ్చినప్పుడు అతను ఎల్లా వెర్రివాడిలాగ చూస్తూ నిలబడ్డాడో అన్నీ విపులంగా అతను రాసేవాడు. చివరకు వాళ్లిద్దరూ ఒకచోట కలుసుకున్నప్పుడు, ఆమె ఇంకా ఆకాశంలోనే ఉండిపోయింది. అతను భూమిమీదికి ఆమెను దింపడానికి ప్రయత్నించినప్పుడు ఆమె చటుక్కుని ఏడుపు ప్రారంభించింది. అతన్ని దూషించింది. తన వెర్రితనాన్ని నిందించుకుంది. ఆమెఉత్తరాలను అతడు తిరిగి ఇచ్చివేశాడు. తన ఉత్తరాలను తీసుకొని అతను చిన్నచిన్న ముక్కలుగా చింపివేశాడు. తన ఉత్తరాలను మాత్రం ఆమె అతి జాగ్రత్తగా పదిలంగా జాకెట్టులో దాచుకుంది.

ఆపిల్లలో తన ఛాయలు కొన్ని ఉన్నాయని శాంతకు అనుమానం కలిగింది. కాని తను కాలేజీ రోజుల్లో ఏమనుకునేదో వెంకటాని కేం తెలుసు? తను ఒక్క ప్రణయలేఖకూడా ఎవరికీ రాయలేదు. కాని తను అప్పుడప్పుడు ఊహలోరాసుకున్న ప్రణయలేఖలన్నీ ఆ అమ్మాయికథలో రాసినవే. ఆమెకు అమితమయిన చిరాకు కలిగింది. క్రమంగా మనస్సుని దిగులు ఆవరించింది. లక్ష్మీకాంతం వచ్చేసరికి ఒడిలో ఆ కథలకాగితాలతో ఆమె పరధ్యానంగా కూర్చుని ఉంది.

"ఎల్లా ఉన్నాయి కథలు ?"

"ఏడిసినట్టున్నాయి. అన్నీ మగవాళ్లూ, ఆడవాళ్లూ ప్రేమా. అదొక్కటే లోకంలో కంతకీ ముఖ్యమయినట్టు" ఆమె కథలకట్టని మంచంమీదికి విసిరి లేచింది.

మరునాడు మళ్లీ కట్ట తీసి ఇంకో కథ చదివింది. కథ ప్రణయాన్ని గురించినదే అయినా పాత్రలు, అను

భవాలు, సంఘటనలూ వేరు. ప్రతి స్త్రీపాత్రలోనూ తన ఛాయలు కొద్దిగా ఉన్నట్టు ఆమెకు అనుమానం. మొదటికథకూ ఈ కథకూ వాతావరణంలో ఎంతో భేదం ఉంది. ఇందులో ఇద్దరు వేశ్యలు వస్తారు. చాలా చిత్రంగా ఉంది కథ. మంచితనమూ, సహనమూ, హుందా, జీవితంలోని ఆనందమూ అంతా వాళ్లలో మూర్తీభవించిఉంటుంది. ఇద్దరూ ఒకేవ్యక్తిని ప్రేమిస్తారు. కాని ఇరువురిమధ్యా ఈసు లేదు. ఆ ప్రేమించినవాడి భార్య పతివ్రత, భక్తురాలు. కాని అతని జీవితాన్ని నరకప్రాయంగా చేసి పారేసింది. ఆమెలో క్రౌర్యమూ, అసహనమూ ప్రతిమాటలోనూ, చేతలోనూ వ్యక్తమవుతాయి.

ఇవన్నీ వెంకటానికి అనుభవమయిన విషయాలవునో కాదో తెలుసుకోవాలని ఆమెకు ఎంతో కుతూహలం మనస్సులో ఉంది. భర్తను వ్యంగ్యంగా ఆమె ప్రశ్నించింది. కాని అతనికీ అట్టే తెలియదేమో. ఒక్కొక్క కథే చదువుతున్నకొద్దీ అతనికి ఆడవాళ్లతో అనేకమందితో పరిచయం ఉండితీరాలని ఆమెకు అనిపించింది. ఇల్లాంటి విషయాలన్నీ ఎవ్వరయినా ఎల్లా రాయగలుగుతారు ? ఇంత అవినీతికరమయిన ఘట్టాలను వర్ణించే కథలు ప్రభుత్వం ఎందుకు ఆపదు ? అసలు ఇల్లాంటి అవినీతిని సంఘం ఎందుకు రూపుమాపదు ? బలహీనులయిన స్త్రీల మనస్సు ఇటువంటివి చదివితే తలక్రిందులయిపోదూ ? భర్తతో ఆమె వాదాలన్నీ ఈ ధోరణిలో నడిచేవి.

ఒక కథలో ఒక స్త్రీపాత్ర ఉంది. ఆమె ఉత్తమప్రేమను వాంఛిస్తుంది. ఆ ప్రేమ ఆమెకు కరగతమయ్యే పరిస్థితులలో దాన్ని అందుకోడానికి ఆమెకు సాహసం చాలదు. నలుగురయిదుగురు వ్యక్తులు, స్త్రీలు, పురుషులు, యువకులు, వృద్ధులు ఆమెకు చాలా ఆప్తులయే పరిస్థితులు ఏర్పడతాయి. నిజమయిన, వాస్తవికమయిన అనురాగం ఎప్పుడు ఫలోన్ముఖంగా అవుతుందో ఆ క్షణంలో ఆమె దాన్నించి తొలిగిపోతుంది. చివరకి ఆమె క్రీస్తుమతం స్వీకరించి బ్రహ్మచారిణిగా అయి, నడివయస్సునించి వృద్ధాప్యంవరకూ ఒక ఆడపిల్లలబడిలో ప్రధానోపాధ్యాయినిగా పనిచేసి చచ్చిపోతుంది. చివరరోజుల్లో ఆమె అతికఠినంగా అయిపోతుంది. దయా, దాక్షిణ్యమూ ఎక్కడా ఉండవు. యౌవనాన్నీ, ప్రేమనీ చూస్తే ఆమెకు ద్వేషం.

కథ మొదటిభాగం అంతా తనేనని శాంత అనుకుంది. కథ చివరివరకూ చదివేసరికి ఆమెకు అమిత భయం వేసింది. కాని తనకూ, ఆ స్త్రీకీ ఉత్తర భాగంలో పోలిక లేదని మనస్సుని కుదుటపరుచుకుంది. అవ్యక్తమయిన భయం ఆమెహృదయాన్ని పట్టుకునిమాత్రం నీడలా ఆవరించింది.

ఆ కథ చదివినతరవాత ఆమె భర్తతో వెంకటాన్నిగురించి చర్చించడం మానివేసింది.

## ౪

వెంకటం మెయిలులో దిగాడు. అతను వస్తాడని ఎవరూ అనుకోలేదు. సామాను విప్పుకోకుండానే స్నానంచేసి లక్ష్మీకాంతం పంచీ, లాల్చీ తొడుక్కుని భోజనానికి రానని చెప్పి కంగారుగా ఊళ్లోకి వెళ్లిపోయాడు. లక్ష్మీకాంతం మూడుగంటల వేళ ఇంటికి తిరిగివచ్చి సాయంత్రందాకా శాంతతో ఏదో కబుర్లు చెపుతూ కూర్చుని చెలుగుండగానే భోజనం చేసి రాత్రి హాస్పిటలులో ఉండవలిసిన అవసరం ఉందని చెప్పి వెళ్లిపోయాడు. ఆమెకూడా భోజనం చేసి డాబామీద దీపాలన్నీ ఆర్పేసి కూర్చుంది. వచ్చీపోయే జనప్రవాహం క్రమంగా తొమ్మిదిగంటలయేసరికి తగ్గింది. ఆమె అలా కూర్చుని పరధ్యానంగా ఆలోచిస్తోంది. ఇంతలో రోడ్డుమలుపు తిరిగి వెంకటం వస్తున్నాడు. ఆమె లేచి క్రిందికి వెళ్లి దీపం వేసి తలుపు తెరిచింది. అతను లాల్చీ విప్పుకుంటూ అడిగాడు:

"అన్నయ్య ఏడీ ?"

"హాస్పిటలులో ఈ రాత్రి పడుకోవాలట. ఒక స్నేహితుడికి చాలా జబ్బుగా ఉందట."

వెంకటం కొంచెంసేపు ఆలోచిస్తూ నిలబడ్డాడు.

"భోజనానికి లే" అంది శాంత.

"నా భోజనం అయింది. భోజనానికి వచ్చేటట్టయితే వస్తానని చెపుదును."

"పక్క ఇక్కడ వేస్తాను."

వెంకటం ఒక క్షణంసేపు తటపటాయించి మెల్లగా కుర్చీలో కూర్చున్నాడు. అతనికి మంచం పక్క హాలులో వేసి ఆమె గదిలోకి పోయి పడుకుంది. కొంతసేపటికి అవతల దీపం ఆర్పడం, అతను మంచం మీద పడుకోడం ఆమె వింది. కాని ఆమెకు ఎంచేతో నిద్రపట్టలేదు. ఎన్నో విషయాలు ఆమెమనస్సులోకి వచ్చిపోతున్నాయి—జరిగినవీ, జరగవలిసినవీ. నిమిషాలూ గంటలూ గడిచి పోతున్నాయి. ఇంతలో అవతల లైటు వెలిగింది. గదితలుపు మెల్లగా తెరుచుకుంది. ఆమెగుండెలు గొంతుకలో కొట్టుకొంటున్నాయి. గదిలో దీపంకూడా వెలిగింది. వెంకటం సాధ్యమయినంతవరకూ చప్పుడు చెయ్యకుండా తన పెట్టె తెరిచి అందులోనించి కాగితాలూ, పెన్నూ తీసుకున్నాడు. పెట్టెమూత మెల్లగా మూసి లేచి దీపం ఆర్పివేశాడు. ఆమె మెలకువగానే నిద్ర నటిస్తూ ఇదంతా చూసింది. అతను గదిలోనించి అవతలకి వెడుతూ గదితలుపు దగ్గరగా మూస్తున్నాడు.

"ఎవరూ ?"అంటూ ఆమె కంగారుగా లేచి కళ్లు నులుపుకుంటూ గుమ్మంలోకి వచ్చింది.

"నేనమ్మా. పెట్టెలో కాగితాలూ కలమూ తీసుకున్నాను. నీకు మెలకువ రాకుండానే తీసుకుందామనుకున్నాను. పెట్టె అసలు ఇవతల పెట్టుకోవలిసింది."

"ఫరవాలేదు......మంచినీళ్లు కావాలా ?"

"ఇందాకటినించీ నిన్ను లేపుదామనుకుంటూనే మొగమాటపడ్డాను. ఒక పెద్ద చెంబుతో ఇయ్యి."

ఆమె వంటఇంటిలోకి వెళ్లి ఒక మరచెంబుతో నీళ్లు తీసుకువచ్చి కుర్చీపక్కని పెట్టింది...ఆవులించింది. మొగం పమిటచెంగుతో తుడుచుకుంది. వెంకటం కలం రెండోకొస నోట్లో పెట్టుకొని ఆలోచిస్తున్నాడు. ఆమె అక్కడే నిలబడిఉండడం మాని అతను అన్నాడు:"వెళ్లి పడుకోవమ్మా."

"నిద్ర తేలిపోయింది."

వెంకటం ఆమెను ఒక ముహూర్తంపాటు తీక్ష్ణంగా చూశాడు. మంచినీళ్లు తాగాడు.

"కథ ఒకటి రాద్దామని లేచాను" అన్నాడు. ఆమె సమాధానం చెప్పలేదు.

"నాకు ఇల్లాంటప్పుడు తప్ప కథలు రాయడం కుదరదు. ఇటువంటప్పుడు నిశ్శబ్దంగా ఉంటుంది. మనస్సు ఇంక ఇతరవిషయాలమీదికి పోదు."

"నేను కూర్చుంటే కథ రాయడం కుదరదా ?"

"నువ్వు కూర్చుంటే కథ, పోనీ, తరవాత రాస్తాను."

"పోనీ, నేను పోయి పడుకుంటాను."

"ఏమయినా ఈవేళ ఇంక కథ రాయలేను."

"ఏం, నా మూలాన్ని మనస్సు చెదిరిపోయిందా ?" ఆమె వెంటనే తను అన్న ముక్కలో తెలివితక్కువను గ్రహించింది. చాలా ఖంగారుపడింది. అతను కళ్లు సన్నగాచేసి ఆమెవేపు చూశాడు.

"ఆడవాళ్లని చూసినంతమాత్రాన్ని నా మనస్సు చెదిరిపోదు." తన్ను కదిపిచూడ్డానికి అతను అల్లా అన్నాడని ఆమె అనుకుంది. గదిలోకి వెళ్లిపోవడమా, అక్కడ కూర్చుని కబుర్లు చెప్పడమా అన్న సందిగ్ధంలో పడింది ఆమెమనస్సు.

"రాద్దామనుకున్న కథ ఈ సాయంకాలం పూర్తయింది. ఇంకా పూర్తిఅయిందనడానికి కూడా వీలులేదు. ఆ కంగారునించి నేనింకా తేరుకోలేదు. రేపు రాస్తాను."

"ఆ కథలన్నీ చదివాను."

"అవినీతిని బోధిస్తాయి నా కథలన్నీ. అంచేత కులస్త్రీలకు రుచించవు."

"అయినా అల్లాంటివి అసలు జరగవు."

"ఆ కథల్లో ఒక్క సంఘటనగాని, ఒక్క పాత్రగాని నేను ఎరగనిది లేదు. నే నసలు లేని విష యాన్ని కల్పించలేను."

ఆమె గుండెలు దడదడ కొట్టుకున్నాయి. ఆమె సాహసించి అంది: "అందులో ఒక కథ ఉంది. ఒక ఆమె క్రీస్తుమతంలో కలిసిపోయి చివరకి చచ్చి పోతుంది. ఆవిడ ఎవరు?"

"నువ్వని నీ అనుమానం." ఆమెముఖం పాలి పోయింది. ఆమె అతనివేపు తెల్లబోయి చూస్తూ కూర్చుంది.

"కాని ఆ కథ అంతా ఒక ప్రత్యేకవ్యక్తిని గురించి కాదు. ఈ సమాజంలో ప్రతిస్త్రీలోనూ ఆ లక్షణాలన్నీ ఉన్నాయి. పెళ్లిచేసుకుని కాపు రాలు చేస్తున్న స్త్రీలందరికీ అందులో కొన్ని లక్ష ణాలు పడతాయి." అతను కొంచెంసే పాగి, "అంగుకే నేను పెళ్లి చేసుకోదలుచుకోలేదు" అన్నాడు.

ఆమె వెటకారంగా అంది: "నీకు తగిన ఆడ వాళ్లు ఈదేశంలో లేనట్టున్నారు."

"కాదు. కాదు. నాకు తగిన ఆడవాళ్లు అసలు నన్ను పెళ్లాడరు. పెళ్లాడినందువల్ల వాళ్లకీ, నాకూ కూడా లాభంలేదు. అంచేత కులాసాగా, స్నేహంగా కాలం గడిపేస్తాం."

"వాళ్లంతా పెళ్లికాని పతివ్రత లనుకుంటాను."

"నిజం. వాళ్లే. వాళ్లలో గొప్ప వ్యక్తు లున్నారు. వాళ్లు మనని బాధపెట్టరు. నేను వాళ్లని బాధపెట్టను. కాని ఎంత చలాకీ అయినవాళ్లున్నారు! ఎంత తెలివయినవాళ్లున్నారు! వాళ్లకి లోకజ్ఞానం ఎంతుందో తెలుసా? ఇట్టే పట్టేస్తారు మనిషిని. వాళ్లతో కులాసాగా మాట్లాడుతుంటేనే చాలు..."

"పెళ్లిచేసుకున్న వాళ్లంతా మూర్ఖు లనుకుం టాను."

"కొందరు పెళ్లిచేసుకు తీరాలి. వాళ్ల శరీరా నికీ, మనస్సుకీ అది సరిపడుతుంది."

"మనస్సుని ఆపుకోలేనివాళ్లంతా అవినీతే గొప్ప దంటారు. అందులో ఇప్పుడీకాలంలో ఆ దృష్టి మరీ ఎక్కువయిపోయింది."

"వదినా! నీలాగ చదువుకున్న స్త్రీ, ఇంకా ఇల్లా సుమతీశతకంలో మాటలు మాట్లాడుతుందని నేను అనుకోలేదు. మనస్సుని ఆపుకోగలిగితే పెళ్లిమాత్రం ఎందుకు? మనస్సుని ఆపుకోగల మనుకున్నవాళ్లు అలా లేనివాళ్లని చూస్తే ఎందుకు అసూయపడతారు?"

"నీస్నేహితురాళ్లను చూసి నేనుమాత్రం అసూయపడడం లేదు."

వెంకటం లేచాడు. ఆమెకుర్చీదగ్గరకు వచ్చాడు. "లేదు. నీ కున్నది అసలు అసూయ. ఆ కథల్లో స్త్రీలక్షణాలలో నీకు చాలా భాగం ఉన్నాయి. నీ కేం కావాలో నీకు తెలియదు. ఏదో బ్రహ్మాండమయినది ఎప్పుడో జరుగుతుందని నీబోటివాళ్లు అను క్షణమూ ఎదురుచూస్తుంటారు. కాని ఏమీ జరగదు. రోజులు అల్లాగ రైలురోడ్డుల్లాగ హెచ్చు తగ్గులు లేకుండా నడిచిపోతాయి. హెచ్చుతగ్గులను చూస్తే ఒకమూల మీకు భయం, ఒకమూల కుతూహలం. అంచేత మీరు సుఖంగా బతకరు, మీ చుట్టుపక్కల ఉన్న వాళ్లని మీరు సుఖంగా బ్రతకనివ్వరు."

ఆమె నిర్ఘాంతపడి కుర్చీలో కూర్చుండిపోయింది. అతను కిటికీదగ్గరకి వెళ్లి అవతలికి చూస్తూ అన్నాడు:

"ఈవేళ ఒక కులస్త్రీ నాతోకూడా రైలులో వచ్చేసింది. జీవితాంతం దాకా నన్ను పట్టుకుని వదల నంటుంది. ఆ బాధ నే నెక్కడ భరించగలను? ఆ పెళ్లిచేసుకున్నవా డెవడో వాడిది ఆ కర్మ. వాడికి టెలిగ్రాం ఇచ్చాను. రే పొచ్చి ఆమెను తీసుకుపోతా డని ఆశిస్తున్నాను. అబ్బ! ఈ కట్టడుల్లో ఉన్న కుల

స్త్రీలు ప్రాణాలు తెంచుతారు. నేను కనిపించేసరికి ఇంక ఇరుగూపొరుగూ చూసుకోకుండా ప్రారంభిస్తుంది. హోటల్లో అందరూ మాకేసి చూడ్డమే. దేన్నయినా భరించవచ్చుగాని మదపిచ్చినిమాత్రం భరించడం కష్టం."

శాంత లేచింది. నాలుగడుగులు అతని వేపు నడిచింది. అతని వీపుమీద చెయ్యి వెయ్యబోయి ఆపుకుంది. అతను చటుక్కుని వెనక్కి తిరిగాడు. ఆమె కళ్లు తిరిగాయి. పడిపోకుండా అతను పట్టుకుని మెల్లగా మంచంమీద పడుకోబెట్టాడు. కుర్చీ పక్కకు ఈడ్చుకుని ముఖంమీద చన్నీళ్లు చల్లాడు. ఆమె తెప్పరిల్లి అతనివేపు చూసి చటుక్కుని వెక్కివెక్కి ఏడవడం మొదలుపెట్టింది. అతను కంగారుపడ్డాడు. నుదుటిమీద నిమిరాడు. ఆమె ఏడుస్తూనే కళ్లు మూసుకు పడుకుంది.

అతను లాల్చీ తొడుక్కున్నాడు. జోడు తొడుక్కున్నాడు. చప్పుడు విని ఆమె లేచి కూర్చుంది. కళ్లు తుడుచుకుంది. అతను అన్నాడు:

"నేను అల్లా తిరిగి తెల్లవారేసరికి వస్తాను. నీకు కొంత నిద్ర అవసరం."

"ఫరవాలేదు. నేను లోపలికి పోయి పడుకుంటాను. నువ్వు రాసుకున్నా సరే. నిద్రపోయినా సరే."

వెంకటం జోడు విప్పకుండానే దగ్గరగా వచ్చి నిలబడి "ఎందుకు నీ కళ్లా ఏడుపొచ్చింది?"

"ఏమో! నాగర్వం దెబ్బ తిం దనుకుంటాను."

"నేను వచ్చీరావడంతోటే నీ అందానికి ముగ్ధుడనయిపోతా ననుకున్నావు. నేను వట్టి వ్యభిచారి నని విన్నావు. వ్యభిచారులంటే అల్లాగే ప్రవర్తిస్తారని నీ ఊహ. నే నల్లా ప్రవర్తించకపోయినందువల్ల......"

"అదే కాదు. నీ కథలో స్త్రీలాగ అయిపోతానేమో నని భయం వేసింది. ఏదో ఒక కానిపని చేస్తే ఆ దెబ్బతో మనస్సు తిరుగుతుం దనిపించింది. కానీ సాహసం లేకపోయింది."

"కానిపని అనుకున్నావా కళ్లా నువ్వు అల్లాంటి ఏపనినీ చెయ్యలేవు, చెయ్యకూడదుకూడాను...... నేను వెళ్లిపోతాను. మళ్లీ చాలారోజులదాకా కనిపించను. నీకు అది ఎక్కువ సుఖం. ఈ విషయాన్ని గురించి ఆట్టే ఆలోచించకు. రేపు ఎవరినన్నా పంపుతాను. స్టేషనుకి సామాను పంపించెయ్యి...ఏదో పనిమీద వెళ్లిపోయా డని అన్నయ్యతో చెప్పు. వాడు వివరాలేమీ అడగడు."

"నువ్వలా వెళ్లిపోనక్కరలేదు. నేను స్థిమితపడ్డాను."

"నీకు తెలియదు. నేను వెళ్లిపోవడం మనిద్దరికీ కూడా మంచిది."

"నాలో ఏదో ఆకర్షణ నీకుకూడా ఉం దన్నమాట."

వెంకటం చిరునవ్వు నవ్వుతూ అన్నాడు: "ఉంది. ఇ దొక కథలాగకూడా రాస్తాను. నిన్ను మాత్రం చాలాకాలంవరకూ మరిచిపోలేను. అంతకంటే ఇంకేమీ చెప్పలేను. పోతాను."

అతను వెళ్లిపోతూంటే ఆమె నిట్టూర్చి అంది: "నిన్న సాయంత్రంకథ ఏ మయిందో తెలుసుకోవాలనుంది."

"కథ రాసి నీకు పంపుతా" అతను వెళ్లిపోయాడు. ఆమె చాలాసేపు తెరచిన గుమ్మంలో నిలబడి చీకట్లోకి చూసింది.